నాడు వంశధార... నేడు పోలవరం

- వంశధార నిర్వాసితుల సమస్యలపై 2015లో సిపిఎం పాదయాత్ర
- జనాన్ని ఉద్యమం వైపు నడిపించిన పోరాటం
- ప్రభుత్వం దిగొచ్చి నిధుల విడుదలకు జిఒ విడుదల
- పోలవరం పాదయాత్ర నేపథ్యంలో గుర్తు తెచ్చుకుంటున్న జనం

మీ త్యాగాలు వెలకట్టలేనివి... మీకు ఎంత ఇచ్చినా తక్కువే... మిమ్మల్ని సంతోషంగా సాగనంపేందుకు ప్రభుత్వానికి రూపాయి ఎక్కువైనా పర్వాలేదు, భరిస్తుంది. మీకు మెరుగైన ప్యాకేజీ, పునరావాసం కల్పిస్తాం... ఇవీ సాగునీటి ప్రాజెక్టులకు భూములు తీసుకునే ముందు నిర్వాసితులకు పాలకులు చెప్పే చల్లని కబుర్లు. ఆనక వాటిని విస్మరించి వారిని ముంచేందుకూ వెనకాడరు. నాడు వంశధార ప్రాజెక్టులో జరిగిందే, నేడు పోలవరంలో పునరావృతమైంది. వంశధార విషయంలో రాష్ట్ర పాలకులు అన్యాయం చేస్తే, పోలవరం నిర్వాసితులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి వంచిస్తున్నాయి. సమస్యల పరిష్కారం కోరుతూ సిపిఎం ఆధ్వర్యాన చేపట్టిన పోలవరం పోరుకేక మహా పాదయాత్ర నేపథ్యంలో వంశధార నిర్వాసితుల విషయంలో నాడు సిపిఎం చేపట్టిన పాదయాత్రను జనం మరోసారి గుర్తు చేసుకుంటున్నారు.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

వంశధార ప్రాజెక్టు ఫేజ్-2, స్టేజ్-2 నిర్మాణ పనులను అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం 2006లో రూ935 కోట్ల అంచనా వ్యయంతో ప్రారంభించింది. ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా కొత్తూరు, ఎల్.ఎన్ పేట లోని మొత్తం 18 గ్రామాలను ముంపు ప్రభావిత గ్రామాలుగా ప్రకటించింది. ఈ గ్రామాల్లో మొత్తం 7,604 మంది కుటుంబాలను నిర్వాసితులుగా గుర్తించింది. 2006లో రైతుల భూములకు మాత్రమే పరిహారం అందించింది. అదీ అప్పటి ధరలకనుగుణంగా ఎకరాకు రూ.1.15 లక్షల నుంచి రూ.1.30 లక్షలు మాత్రమే చెల్లించింది. 18 ఏళ్లు నిండిన వారికి యూత్ ప్యాకేజీ, ఇళ్లకు పరిహారం, ఇళ్ల పట్టాలను అందించలేదు. 2014లో అధికారంలోకి వచ్చిన టిడిపి ప్రభుత్వం నిర్వాసితుల పరిహారం, పునరావాసం వంటి అంశాల జోలికి వెళ్లలేదు. పైగా కూలి రేట్లు, డీజిల్, సిమెంట్ వంటి ధరలు పెరిగాయన్న కారణంతో కాంట్రాక్టర్ల కోసం అంచనా వ్యయాన్ని దాదాపు 50 శాతం మేర పెంచింది. ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ 2015 ఫిబ్రవరిలో నిర్వాసితుల సంఘం చేపట్టిన పాదయాత్రకు సిపిఎం అండగా నిలిచింది. నిర్వాసితులు శాంతియుత పద్ధతుల్లో ధర్నాలు, ఆందోళనలు చేపట్టినా ప్రభుత్వంలో కదలిక రాకపోవడంతో హిరమండలం బ్యారేజీ సెంటర్‌లో 120 రోజుల పాటు నిర్వాసితులతో కలిసి నాయకులు దీక్షలు చేపట్టారు. నిర్వాసితుల ఆందోళనలను లెక్కచేయని నాటి టిడిపి ప్రభుత్వం, ప్రాజెక్టు పనులను పూర్తి చేసే పనిని వేగవంతం చేసింది. ఆగ్రహించిన నిర్వాసితులు బ్యారేజ్ సెంటర్‌లో చేపడుతున్న పనులను అడ్డుకునేందుకు బయలుదేరి సమరశీల పోరాటం సాగించారు. నిర్వాసితుల ఆగ్రహాన్ని గుర్తించిన ప్రభుత్వం యూత్ ప్యాకేజీ డబ్బులను విడుదల చేస్తూ, జిఒ నంబరు 460ను విడుదల చేసింది. ప్రభుత్వం జిఒ విడుదల చేసినా, అందుకు సంబంధించిన డబ్బులను మాత్రం విడుదల చేయకపోవడంతో మరోసారి పోరాడి సాధించుకున్నారు.

సిపిఎం చేపట్టిన పాదయాత్రలో కదలివచ్చిన వంశధార నిర్వాసితులు (ఫైల్)

68.12 కోట్లు ఎక్స్‌గ్రేషియా పెండింగ్

నిర్వాసితులకు టిడిపి ప్రభుత్వం అన్యాయం చేసిందని, తాము అధికారంలోకి వస్తే 2013 భూసేకరణ చట్టం అమలు చేస్తామంటూ పలు సందర్భాల్లో హామీనిచ్చిన సిఎం జగన్, అధికారంలోకొచ్చాక విస్మరించారు. దీనిపై నిర్వాసితుల సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళనలకు సిపిఎం మద్దతుగా నిలిచింది. దీంతో దిగొచ్చిన ప్రభుత్వం గతేడాది జూన్ 21న వారికి కొంత మొత్తాన్ని ఎక్స్‌గ్రేషియా రూపంలో చెల్లించేందుకు జిఒ నంబరు 1632ను వెలువరించింది. భూములు కోల్పోయిన వారికి ఎకరాకు రూ.లక్ష, నిర్వాసిత కుటుంబాల్లో కుటుంబానికి చెరో రూ.లక్ష అందించింది. ఆ చెల్లింపులూ సరిగా చేయలేదు. నిర్వాసితులకు మొత్తం మీద రూ.216.71 కోట్లకు గానూ రూ.148.59 కోట్లు చెల్లించింది. ఇంకా రూ.68.12 కోట్ల బకాయిలు ఉన్నాయి.

అపరిష్కృతంగానే సమస్యలు

పలు ప్రభుత్వ శాఖల తరుపు నుంచి నిర్వాసితులను ఆర్థికంగా ఆదుకుంటామని అధికారులు చెప్పినా, అవి నేటికీ అమలు కాలేదు. నిర్వాసితులకు సంబంధించి అనేక ఇతర సమస్యలూ అపరిష్కృతంగా ఉన్నాయి. డి-పట్టా భూములకు ఇప్పటికీ డబ్బులు చెల్లించలేదు. యూత్ ప్యాకేజీ, ఇళ్ల నిర్మాణ విలువ చెల్లింపులు పెండింగ్‌లో ఉన్నాయి. తల్లిదండ్రులు మరణించిన తర్వాత వారి వారసులకు ఇళ్ల స్థలాలు ఇవ్వలేదు. నిర్వాసితుల పునరావాసం, వారి సమస్యల పరిష్కారానికి ఆరు నెలల పాటు అధికారులను అదే పనిలో ఉంచుతామని 2017లో వారిని గ్రామాల నుంచి తరలింపు సందర్భంగా జిల్లా అధికారులు చెప్పినా, అది అమలు కాలేదు. పోరాటాలు సాగిస్తే తప్ప పాలకులు తమంతట తాము సమస్యలను పరిష్కరించే పరిస్థితి కనిపించడం లేదు. వంశధార నిర్వాసితులకు జరిగినట్లుగానే పోలవరం నిర్వాసితుల విషయంలో జరగడంతో పోలవరం పోరుకేక పేరుతో చేపట్టిన మహా పాదయాత్రకు విశేష స్పందన లభిస్తోంది.

తొలకరి పలకరింత

జిల్లాలో పలుచోట్ల కురిసిన వర్షం

ప్రజాశక్తి - పలాస, ఆమదాలవలస

నైరుతి రుతుపవనాలు జిల్లాను పలకరించాయి. జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆదివారం తొలకరి వర్షాలు కురిశాయి. ఇన్నాళ్లూ భానుడి భగభగలతో అల్లాడిన ప్రజలు మారిన వాతావరణంతో ఉపశమనం లభించినట్లయింది. వడగాలులతో ఉడికిపోయిన ప్రజలు తొలకరి వాన చినుకులు పడడంతో సేదతీరారు. ఆమదాలవలస, పలాస, నందిగాం, టెక్కలి, కోటబొమ్మాళి, సంతబొమ్మాళి, నరసన్నపేటతో పాటు పలు మండలాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు పడ్డాయి. నైరుతి రుతుపవనాల రాక ఆలస్యం కావడంతో వర్షం కోసం రైతులు ఎదురుచూశారు. దుక్కులు చేసి ఆకాశం వైపు చూశారు. ఎట్టకేలకు వర్షాలు ప్రారంభం కావడంతో అన్నదాతల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ఇప్పటికే ఖరీఫ్ సాగుకు సన్నద్ధమైన రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. పలు ప్రాంతాల్లో వెదలు జల్లుతుండగా, మరికొన్ని చోట్ల నారుమళ్లను సిద్ధం చేసుకుంటున్నారు.

పలాస : కాశీబుగ్గ రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపు నీరు

బూర్జ : విత్తనాలు చల్లుతున్న రైతు

జగన్ ముద్దు... కిరణ్ వద్దు

- ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా వైసిపి అసమ్మతి నాయకుల ర్యాలీ
- అడ్డుకున్న పోలీసులు
- ఆరుగురు అరెస్టు, విడుదల

ర్యాలీ నిర్వహిస్తున్న గ్రామస్తులు

ప్రజాశక్తి - లావేరు

ఎచ్చెర్ల నియోజకవర్గ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్‌కు వ్యతిరేకంగా వైసిపి సీనియర్ నాయకులు లుకలాపు అప్పలనాయుడు ఆధ్వర్యాన అసమ్మతి నాయకులు ఆదివారం ర్యాలీ నిర్వహించారు. జగన్ ముద్దు... కిరణ్ వద్దు అన్న ప్లకార్డులు పట్టుకుని మండలంలోని పెద్దలింగాలవలస ప్రధాన కూడలి నుంచి వెంకటాపురం సమీపంలోని పామాయిల్ తోట వరకు పెద్దసంఖ్యలో హాజరైన మహిళలతో ర్యాలీగా బయలుదేరారు. ర్యాలీని ఎస్ఐ కోటేశ్వరరావు నేతృత్వాన పోలీసులు అడ్డుకున్నారు. అనుమతుల్లేకుండా ర్యాలీలు, సభలు నిర్వహించరాదని వైసిపి మండల మాజీ అధ్యక్షులు వట్టి సత్యనారాయణ, మాజీ సర్పంచ్ గొర్లె రామినాయుడు, ఎస్.నాగరాజు, లుకలాపు సూర్యనారాయణతో పాటు మరో ఇద్దరిని అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అయినా నాయకులు పామాయిల్ తోటలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పలనాయుడుతో పాటు పలువురు నాయకులు మాట్లాడుతూ గత ఎన్నికల్లో తామంతా కష్టపడి కిరణ్ కుమార్‌ను ఎమ్మెల్యేగా గెలిపిస్తే పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. రూ.లక్షలు ఖర్చు పెట్టి పనులు చేసి నాలుగేళ్లవుతున్నా, నేటికీ బిల్లులు మంజూరు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో తాము అప్పులపాలయ్యామని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే తన కుటుంబీలకే పదవులు, పనులు, అధికారాలను కట్టబెట్టి తమను తొక్కిపెట్టి కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో కిరణ్ కుమార్‌కు టిక్కెట్ ఇస్తే పనిచేసేది లేదని కరాఖండిగా తేల్చిచెప్పారు.

10, 11న అంగన్వాడీల మహా ధర్నా

ప్రజాశక్తి - శ్రీకాకుళం

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

అంగన్వాడీలకు వేతనాలు పెంచాలని, గ్రాట్యుటీ అమలు చేయాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జూలై 10, 11 తేదీల్లో కలెక్టరేట్ వద్ద చేపట్టే మహా ధర్నాను జయప్రదం చేయాలని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు డి.సుధ, సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు పిలుపునిచ్చారు. అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కమిటీ సమావేశం నగరంలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్వాడీలకు సకాలంలో వేతనాలు, బిల్లులు చెల్లించడం లేదని విమర్శించారు. తెలంగాణ కన్నా అదనంగా రూ.వెయ్యి వేతనాలు పెంచుతామని సిఎం జగన్ హామీ నీటి మీద రాతగా మిగిలిందన్నారు. అంగన్వాడీలకు గ్రాట్యుటీ అమలు చేయాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాలని కోరినా రాష్ట్ర ప్రభుత్వం స్పందించడం లేదని చెప్పారు. సెంటర్ల నిర్వహణకు పెట్టుబడులు పెట్టాల్సిన పరిస్థితికి అంగన్వాడీలు నెట్టబడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. రకరకాల యాప్‌లు తెచ్చి పనిభారం పెంచారని, పర్యవేక్షణ పేరుతో వేధింపులకు గురిచేస్తున్నారని తెలిపారు. మోడీ ప్రభుత్వం స్కీమ్‌వర్కర్లను మోసం చేసిందని విమర్శించారు. బడ్జెట్‌లో ఐసిడిఎస్‌కు నిధుల కేటాయింపు పెంచలేదని, అంగన్వాడీ వేతనాల పెంపు లేదన్నారు. సంవత్సరానికి పైగా సెంటర్ అద్దెలు చెల్లించడానికి నిధులు లేవన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. గ్యాస్, నిత్యావసరాల ధరలు పెరిగినా అందుకనుగుణంగా వేతనాలు, మెనూ ఛార్జీలు పెంచలేదని చెప్పారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ మెనూ ఛార్జీలు పెంచాలని, గ్యాస్‌ను ప్రభుత్వమే సరఫరా చేయాలని, 2017 నుంచి పెండింగ్‌లో ఉన్న టిఎ బిల్లులు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్రాట్యుటీ ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.ఐదు లక్షలు ఇవ్వాలని, వేతనంలో సగం పెన్షన్ ఇవ్వాలని కోరారు. 300 జనాభా దాటిన మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని, వర్కర్లతో సమానంగా వేతనాలు ఇవ్వాలన్నారు. మినీ వర్కర్లకు ప్రమోషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లబ్ధిదారులకు నాణ్యమైన ఆహారాన్ని సరఫరా చేయాలని, ఆయిల్, కందిపప్పు పరిమాణాన్ని పెంచాలన్నారు. రాజకీయ వేధింపులు ఆపాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం మహాధర్నా పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా కోశాధికారి కె.కళ్యాణి, నాయకులు పి.లతాదేవి, జె.కాంచన, కె.సుజాత, పి.భూలక్ష్మి, ఇ.అప్పలనర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రజానాట్యమండలి రాష్ట్ర నాయకులు రమణ

ప్రజానాట్యమండలి నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ప్రజానాట్యమండలి జిల్లా నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. సుందరయ్య భవన్‌లో నిర్వహించిన ప్రజానాట్య మండలి సమావేశంలో జిల్లా కన్వీనర్‌గా టి.వైకుంఠరావు ఎన్నికయ్యారు. కమిటీ సభ్యులుగా ఎన్.చంద్రయ్య, పి.శ్రీనివాసులు, రాంబాబు, టి.త్రినాథ్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ప్రజానాట్యమండలి రాష్ట్ర నాయకులు జి.రమణ మాట్లాడుతూ దైనందిన జీవితంలో సామాన్య ప్రజానీకం ఎదుర్కొనే సమస్యలపై జనబాహుళ్యానికి అవగాహన కల్పించే ఆశయంతో ప్రజానాట్యమండలి 1943లో స్థాపించబడిందన్నారు. ప్రజానాట్యమండలి కళ కళ కోసం కాదు, కళ ప్రజల కోసం అని నినదించి తెలుగునాట ప్రజా సాంస్కృతికోద్యమ సారథిగా పనిచేస్తోందన్నారు. ప్రజా ఉద్యమాలపై అంకితభావంతో తన కలాన్ని, గళాన్ని అంకితమిస్తూ ఉద్యమిస్తోందని తెలిపారు. తెలుగు భాష, సాంస్కృతికోద్యమానికి బాసటగా నిలిచి మా తెలుగు తల్లికి మల్లెపూదండ పేరుతో కళారూపాలను ప్రదర్శించిందన్నారు. శ్రీశ్రీ, గురజాడ, వేమన, కందుకూరి, జాషువా, వీరబ్రహ్మం వంటి సంఘ సంస్కర్తల భావజాలాన్ని, వారి రచనల సందేశాన్ని కళారూపాలుగా మలిచి పల్లెలు, పట్టణాల్లో వాడవాడలా విస్తృత ప్రచారాన్ని నిర్వహించిందన్నారు. అల్లూరి సీతారామరాజు పోరాట చరిత్రను వీధినాటికగా మలిచి వందలాది ప్రదర్శనలు ఇచ్చిందని తెలిపారు. ప్రజాస్వామ్య హక్కులు కాలరాయబడుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజా ఉద్యమాలకు అండగా ప్రజానాట్యమండలిని బలోపేతం చేయాలన్నారు.

స్పీకర్ సీతారాంకు కేకు తినిపిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

జన హృదయ నేత రాజగోపాలరావు

శత జయంతి ఉత్సవాల ముగింపు సభలో వక్తలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జన హృదయ నేత మాజీ ఎంపీ, కీర్తిశేషులు బొడ్డేపల్లి రాజగోపాలరావు అని పలువురు వక్తలు పేర్కొన్నారు. ప్రజల మనసుల్లో చెరగని ముద్ర వేసుకున్నారని కొనియాడారు. నగరంలోని ఎన్‌టిఆర్ మున్సిపల్ హైస్కూల్ మైదానంలో బొడ్డేపల్లి రాజగోపాలరావు శత జయంతి ఉత్సవాల ముగింపు వేడుకలను ఆదివారం నిర్వహించారు. ఇందులో భాగంగా ఏడు రోడ్ల కూడలి వద్ద ఏర్పాటు చేసిన ఆయన కాంస్య విగ్రహాన్ని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం, రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు, ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు తదితరులు ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన సభలో వారు మాట్లాడుతూ ఆరుసార్లు ఎంపీగా ఎన్నికైన ఆయన జిల్లా అభివృద్ధిలో కీలకపాత్ర పోషించారని కొనియాడారు. ఆయన ఆదర్శ రాజకీయ జీవితం భావితరాలకు ఆదర్శం కావాలన్నారు. ఆమదాలవలసలో సహకార చక్కెర కర్మాగారం, నైర, రాగోలు, ఆమదాలవలసలో వ్యవసాయ పరిశోధనా కేంద్రాలను ఏర్పాటు చేయించడంలో ఆయన పాత్ర ఎనలేనిదన్నారు. రాజగోపాలరావును ఒక పార్టీకి చెందిన నాయకునిగా కాకుండా జిల్లా అభివృద్ధి ప్రదాతగా చూడాలన్నారు. శ్రీకాకుళాన్ని జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేయించి కేంద్ర ప్రభుత్వం వద్ద వెనుకబడిన జిల్లాగా గుర్తించి నిధుల మంజూరుకు కృషి చేశారని గుర్తుచేశారు. అనంతరం పలువురిని సత్కరించారు. కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ అధ్యక్షతన నిర్వహించిన సభలో జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్, ఎస్‌పి జి.ఆర్ రాధిక, కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్, సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు డి.గోవిందరావు, బి.శ్రీరామ్మూర్తి, పలు పార్టీల నాయకులు, అధికారులు, కళింగ సంక్షేమ సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల బాగు కోరే ప్రభుత్వం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

మాట్లాడుతున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

వైసిపి ప్రభుత్వం ఉద్యోగుల బాగు కోరుకుంటుందని, ఆ దిశగా అవసరమైన చర్యలు తీసుకుంటుందని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం, రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. నగరంలోని అంబేద్కర్ ఆడిటోరియంలో థాంక్యూ సిఎం సర్ పేరిట కాంట్రాక్టు ఉద్యోగులు ప్రజాప్రతినిధుల అభినందన సభను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మాన మాట్లాడుతూ కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించి, వారికి మంచి భవిష్యత్‌ను అందించిన ఘనత జగన్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఇది ఎన్నికల కోసం తీసుకున్న నిర్ణయం కాదని, ఉద్యోగుల బాగు కోసం తీసుకున్నదని చెప్పారు. పాదయాత్రలో ఇచ్చిన మేరకు ముఖ్యమంత్రి జగన్ అమలు చేశారని చెప్పారు. ప్రభుత్వంలో ఉద్యోగులు భాగమని, వారి సంక్షేమానికి సిఎం చేయాల్సినవన్నీ చేస్తున్నారని తెలిపారు. సిపిఎస్‌ను రద్దు చేసి, జిపిఎస్‌ను తీసుకొస్తున్నారని తెలిపారు. రిటైర్డ్ ఉద్యోగుల జీవన ప్రమాణాలకు అనుగుణంగా జిపిఎస్‌ను రూపొందించినట్లు చెప్పారు. ప్రభుత్వం తరపున ఉద్యోగులు గొంతు విప్పి మాట్లాడాలన్నారు. పాలనా సంస్కరణలు తీసుకొస్తున్నామని, వాటిని ఆహ్వానించాలని కోరారు. రానున్న రోజుల్లో ఉద్యోగులు అండగా ఉంటే, మరిన్ని మార్పులు సాధ్యం కాగలవన్నారు. ఉద్యోగుల సంక్షేమానికి పాటుపడుతున్న వైసిపి ప్రభుత్వానికి మద్దతుగా నిలవాలని కోరారు. అనంతరం ప్రజాప్రతినిధులను సత్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, కార్పొరేషన్ల చైర్మన్లు మామిడి శ్రీకాంత్, అంధవరపు సూరిబాబు, ఎన్‌జిఒ అసోసియేషన్ రాష్ట్ర సహాధ్యక్షులు చౌదరి పురుషోత్తం నాయుడు, జిల్లా అధ్యక్షులు హనుమంతు సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన రోడ్డు విస్తరణ పనులు

శ్రీకాకుళం అర్బన్ : నగరంలోని డే అండ్ నైట్ కూడలి నుంచి ఆమదాలవలస వరకు చేపడుతున్న రోడ్డు విస్తరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అధికారులను ఆదేశించారు. రోడ్డు నిర్మాణ పనులను కొత్తరోడ్డు నుంచి బలగ వరకు ఆదివారం పరిశీలించారు. ఆమదాలవలస, శ్రీకాకుళం పట్టణాలను కలిపే ఈ రోడ్డుకు ప్రాధాన్యత ఉందన్నారు. ఆమదాలవలస రైల్వేస్టేషన్‌కు రాకపోకలు సాగించే వారితో పాటు పాలకొండ, పార్వతీపురం మన్యం జిల్లా, ఒడిశా ప్రాంతాలకు వెళ్లేందుకు ఇదే మార్గమన్నారు. రూ.40 కోట్ల వ్యయంతో పనులు చేపడుతున్నామని, రోడ్డు విస్తరణలో ఎదురయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. కొన్నిచోట్ల జిరాయతీ భూములు, కట్టడాలు తొలగించాల్సి ఉండడం వల్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. జనావాసాలు ఉన్న ప్రాంతాల్లో వారి అభ్యర్థన మేరకు 70 అడుగుల మేరకు రోడ్డు వెడల్పు చేస్తున్నామని, మిగిలిన ప్రాంతంలో 80 అడుగులు రోడ్డు నిర్మాణం చేపడుతున్నామన్నారు. వర్షాకాలంలో రోడ్డు నిర్మాణ పనులు చేపడితే తేమ వల్ల నాణ్యత దెబ్బతింటుందన్నారు.

ప్రారంభిస్తున్న ఎంపీ రామ్మోహన్ నాయుడు

రాష్ట్రంలో అభివృద్ధి శూన్యం

ఎంపీ కె.రామ్మోహన్ నాయుడు

ప్రజాశక్తి - కొత్తూరు

వైసిపి ప్రభుత్వ నాలుగేళ్ల పాలనలో రాష్ట్రంలో అభివృద్ధి శూన్యమని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు విమర్శించారు. మండలంలోని వీరనారాయణపురం రహదారిలో రూ.23 లక్షల ఎంపీ ల్యాడ్స్ నిధులతో నిర్మించిన కల్వర్టు, మాకవరం పంచాయతీ రూ.రెండు లక్షల వ్యయంతో నిర్మించిన మంచినీటి ట్యాంకు ఆదివారం ప్రారంభించారు. అనంతరం మెట్టూరులో టిడిపి పాతపట్నం నియోజకవర్గ స్థాయి విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇసుక, గనుల దోపిడీకి పాల్పడుతున్న వైసిపి ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లో ఇంటికి సాగనంపాలని పిలుపునిచ్చారు. ఒక్క ఛాన్స్ అంటూ అధికారం చేపట్టిన జగన్, రాష్ట్రాన్ని అన్ని రంగాల్లోనూ వెనక్కి నెట్టారని ఆరోపించారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలూ అసంతృప్తితో ఉన్నారని చెప్పారు. అధికారంలోకొస్తే వంశధార నిర్వాసితులకు 2013 భూసేకరణ చట్టం అమలు చేస్తామని హామీనిచ్చారని, ఆ హామీ ఏమైందని ప్రశ్నించారు. వచ్చే ఎన్నికల్లో టిడిపి గెలుపునకు ప్రతి కార్యకర్తా సైనికుడిలా పనిచేయాలన్నారు. మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ మాట్లాడుతూ సంక్షేమ పథకాల పేరుతో ధరలు పెంచి ప్రజల నడ్డి విరిచారని విమర్శించారు. విద్యుత్ ఛార్జీలు సామాన్యునికి పెను భారంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి కలమట సాగర్, అగతముడి భైరాగి నాయుడు, దాస్ నాయుడు, సర్పంచ్ జి.భాస్కరరావు, ఎన్.అచ్యుతరావు, ఎ.శంకరరావు, ఎంపిటిసి గోవిందరావు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెంచిన కరెంట్ ఛార్జీలను తగ్గించాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

మాట్లాడుతున్న ఆదినారాయణమూర్తి

పెంచిన కరెంటు ఛార్జీలను తగ్గించి, ప్రజలకు ఉపశమనం కలిగించాలని శ్రీకాకుళం ట్యాక్స్ పేయర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు టి.భాస్కరరావు, ఎం.ఆదినారాయణ మూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగరంలోని ఒక కళ్యాణ మండపంలో ట్యాక్స్ పేయర్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఆదివారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం కరెంటు ఛార్జీలు పెంచిందన్నారు. పదేళ్ల నుంచి వాడుకున్న కరెంటుకు బిల్లులు కట్టేసినా, లోటు పేరిట సర్దుబాటు ఛార్జీల రూపంలో రూ.వేల కోట్ల అదనపు భారం మోపారని విమర్శించారు. ఇప్పటివరకు రెండేళ్లకో, మూడేళ్లకో పెరిగిన కరెంటు ఛార్జీలు, ఇక ప్రతినెలా పెంచుకునేందుకు ప్రభుత్వం చర్యలు మొదలు పెట్టిందన్నారు. కరెంటు బిల్లులే కాకుండా ఫిక్స్‌డ్ ఛార్జీ, సర్దుబాటు ఛార్జీ ఇలా రకరకాల పేర్లు పెట్టి ప్రజలపై భారం వేస్తోందని విమర్శించారు. విద్యుత్ వినియోగించిన అసలు ఛార్జీల కంటే కొసరు ఛార్జీలు ఎక్కువ ఉంటున్నాయన్నారు. ప్రపంచవ్యాప్తంగా కరెంటు ఛార్జీలు తగ్గాయని, గతంలో సోలార్ విద్యుత్ యూనిట్ రూ.12 కాగా ఇప్పుడు ఉత్పత్తి ఖర్చు తగ్గి రూ.రెండుకు పడిపోయిందని తెలిపారు. ఈలెక్కన వినియోగదారులపై కరెంటు ఛార్జీలు తగ్గాల్సి ఉన్నా, ప్రభుత్వం మాత్రం పలురూపాల్లో పెంచుతోందని చెప్పారు. విద్యుత్ రంగాన్ని ప్రైవేట్ కంపెనీలకు అప్పగించడం వల్ల బహిరంగ మార్కెట్‌లో అధిక ధరలకు ప్రభుత్వం కొనుగోలు చేస్తోందన్నారు. ప్రతి ఇంటికీ స్మార్ట్‌మీటర్లు పెట్టబోతున్నారని, అందుకయ్యే రూ.13 వేలను వాయిదాల రూపంలో వసూలు చేయబోతున్నారని చెప్పారు. భవిష్యత్‌లో డిమాండ్‌ను బట్టి గంట గంటకూ రేటు నిర్ణయించే ప్రమాదముందని హెచ్చరించారు. రాత్రిపూట ఎక్కువ రేటు పద్ధతిని తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని చెప్పారు. వీటిపై ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు ముఖ్య కూడళ్లలో ప్రజా బ్యాలెట్ నిర్వహణ, కరపత్రాల పంపిణీ, సంతకాల సేకరణ వంటి కార్యక్రమాలు చేపట్టాలని సమావేశంలో తీర్మానించారు. సమావేశంలో పలు ప్రజా, కార్మిక సంఘాల నాయకులు ఎం.నరసింహమూర్తి, పి.తేజేశ్వరరావు, వి.జి.కె మూర్తి, కె.శ్రీనివాసు, ఎం.శ్రీనివాసరావు, పి.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో చిచ్చరపిడుగు

ప్రజాశక్తి- పొందూరు

సాధించిన పతకాలను చూపుతున్న సుజిత్

కరాటేపై ఆసక్తితో చిన్ననాటి నుంచే సాధన చేస్తూ అద్భుతమైన విజయాలను సాధిస్తూ తనదైన ముద్ర వేసుకున్నాడు ఈ చిన్నోడు. పలుచోట్ల నిర్వహించిన కరాటే పోటీల్లో ఒక స్థానాన్ని సంపాదించుకుని అందరి మన్ననలు పొందుతున్నాడు పొందూరుకు చెందిన వడగ సుజిత్. ఇటీవల ఢిల్లీలో నిర్వహించిన ఇండియా ఓపెన్ ఇంటర్ నేషనల్ కరాటే ఛాంపియన్ షిప్-23 పోటీల్లో పొందూరుకు చెందిన వడగ సుజిత్ తృతీయ స్థానం సాధించాడు. ఈనెల 17,18 తేదీల్లో నిర్వహించిన కరాటే పోటీల్లో సబ్ జూనియర్ 20 కేజీల కేటగిరిలో కాంస్య పతకం సాధించాడు. అలానే 2022 డిసెంబరులో విశాఖపట్నం పోర్టు స్టేడియంలో నిర్వహించిన విశాఖ ఓపెన్ నేషనల్ కరాటే ఛాంపియన్ షిప్ పోటీల్లో తృతీయ స్థానం సాధించాడు. 2023 మే నెలలో స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన ఇండోనేపాల్ కరాటే ఓపెన్ ఛాంపియన్‌షిప్ మినిస్టర్ కప్ పోటీల్లో రెండు విభాగాల్లో ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించాడు. ఢిల్లీలో నిర్వహించిన పోటీల్లో టెక్నికల్ కమ్యూనికేషన్ మెంబర్, వరల్డ్ కరాటే ఫెడరేషన్, వైస్ ప్రెసిడెంట్ కామన్ వెల్త్ కరాటే ఫెడరేషన్ చేతులు మీదుగా కాంస పతకం అందుకున్నాడు. సుజిత్ స్థానిక వేద పాఠశాలలో రెండో తరగతి చదువుతున్నాడు. తండ్రి వడగ చంద్రశేఖర్ రాజాం ప్రభుత్వాస్పత్రిలో ఫార్మసిస్టుగా పనిచేస్తున్నాడు. సుజిత్ సాధించిన విజయాలకు తల్లిదండ్రులు చంద్రశేఖర్, భవాని ఆనందం వ్యక్తం చేశారు. వేద పాఠశాల డైరెక్టర్ బాబూరావు, కరస్పాండెంట్ సునీత, ప్రిన్సిపాల్ రామకృష్ణ, సిబ్బంది అభినందించారు.

ట్రోఫీని అందజేస్తున్న రాజు

మహిళా క్రికెట్ టోర్నీ విజేత 'ఆల్ఫా'

ఇచ్ఛాపురం : స్థానిక సురంగ్ రాజా క్రీడా మైదానంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న మహిళా క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ఉల్లాసంగా.. ఉత్సాహంగా ముగిసింది. భానుమతి నర్సింగరావు మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ ఆధ్వర్యాన నిర్వహించిన ఫైనల్ మ్యాచ్‌లో ఆల్ఫా క్రికెట్ క్లబ్ విన్నర్స్‌గా, ఐసిసి ఉమెన్ క్రికెట్ జట్టు రన్నర్‌గా నిలిచాయి. వీరికి ఆశిక్ క్లబ్ ప్రెసిడెంట్, జనసేన ఇన్‌ఛార్జి దాసరి రాజు, బత్తుల వెంకటరమణ, రాపాక జగదీష్, ఐసిసి క్రికెట్ క్లబ్ చీఫ్ కోచ్ గోపి తదితరులు ట్రోఫీలను అందజేశారు. జిఎన్ఆర్ క్రికెట్ క్లబ్ చీఫ్ కోచ్, సెక్రటరీ ఎస్.గోపాలరావు సహాయ సహకారాలు అందజేశారు.

గ్రంథాలయంలో 'చదవడం మాకిష్టం'

లావేరు : లావేరు శాఖాగ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి విద్యార్థీ ఆదివారం నిర్వహించిన చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విద్యార్థులతో కథలు చదివించారు. డి.దీప్తికి ప్రథమ, రౌతు సెల్వ కుమార్ కు ద్వితీయ, ఇజ్జు యస్మితకు తృతీయ బహుమతులు వచ్చాయి. వీరికి గ్రంథాలయం తరుపున బహుమతులను అందజేశారు. గ్రంథాలయ సహాయకులు ఎ.గడ్డియ్య విద్యార్థులు పాల్గొన్నారు.

వరి విత్తన ఎంపికతోనే అధిక దిగుబడులు

ప్రజాశక్తి- ఆమదాలవలస

ఎంటియు వరి విత్తనాలు

ఖరీఫ్ సీజన్‌లో నాట్లు వేయడానికి అనుకూలమైన వరి విత్తన ఎంపికతోనే అధిక దిగుబడులు సాధించవచ్చునని మండల వ్యవసాయ అధికారి మెట్ట మోహనరావు అన్నారు. 'ఆదివారం' ప్రజాశక్తితో మాట్లాడారు. మండలంలో 13,250 ఎకరాల విస్తీర్ణంలో ప్రధాన ఆహార పంటగా వరి సాగు అవుతుందన్నారు. వరి సాగులో నాణ్యమైన విత్తన ఎంపిక నుంచి పంట ఇంటికి చేరేవరకు సరైన యాజమాన్యం మెలుకువలు పాటించిన ఎడల సాగు ఖర్చు తగ్గి మంచి దిగుబడులు సాధించి రైతులు నికర ఆదాయాన్ని పెంపొందించుకోవచ్చు అని అన్నారు. ఆయన మాటల్లో...

- స్వర్ణ ఎంటియు 7029. ఈ విత్తనం 1982లో స్వర్ణ ఎంటియు 7029 విత్తనం విడుదలైంది. ఖరీఫ్ సీజన్‌కు అనుకూలమైన విత్తనం. 150 రోజులు పంటకాలం. ఎకరాకు 30 కింటాళ్లు దిగుబడి వస్తుంది. గింజ నిద్ర వస్తా మూడు వారాలు. ఎండాకు తెగుళ్లను తట్టుకొని నిలబడగలదు. వివిధ రకాల భూముల్లోనూ ఇతర వాతావరణ పరిస్థితుల్లోనూ అలాగే రెండు పంటలు పండించు ప్రాంతాలకు స్థిరమైన దిగుబడి నిచ్చే సన్నని గింజ గల రకమని తక్కువ నత్రజనితో అధిక దిగుబడినిస్తుంది.
- ఇంద్ర ఎంటియు 1061. ఈ విత్తనం 2006లో ఇంద్ర ఎంటియు 1061 విత్తనాన్ని విడుదల చేశారు. ఖరీఫ్ కాలానికి అనుకూలమైన విత్తనం. 150 రోజులు పంటకాలం. ఎకరాకు 30 క్వింటాళ్ల ధాన్యం దిగుబడి వస్తుంది. గింజ నిద్రావస్థ రెండు నుంచి మూడు వారాలు. సుడిదోమ పోటును తట్టుకోగలదు. సన్నని గింజ, చేను పడిపోదు. పది రోజుల వరకు ముంపును కొద్దిపాటి చౌడును తట్టుకోగలదు. అన్నానికి అనుకూలంగా ఉంటుంది.
- సోనా మసూరి బిపిటి 3291. ఈ విత్తనం 1982లో సోనామసూరి బిపిటి 3291 విత్తనం విడుదలైంది. ఖరీఫ్ కాలానికి అనుకూలమైన విత్తనం. 135 నుంచి 140 రోజులు పంట కాలం. ఎకరాకు 25 క్వింటాళ్ల ధాన్యం దిగుబడి వస్తుంది. గింజ నిద్రావస్థ రెండు వారాలు. అగ్గి తెగుళ్లను తట్టుకొని నిలబడుతుంది. గింజ సన్నంగా ఉండి అన్నానికి అనుకూలంగా ఉంటుంది.
- శ్రీకాకుళం సన్నాలు ఆర్‌జిఎల్ 2537. ఈ విత్తనం 1996లో శ్రీకాకుళం సన్నాలు ఆర్‌జిఎల్ 2537 విత్తనాన్ని విడుదల చేశారు. ఖరీఫ్ కాలానికి ఈ విత్తనం అనుకూలం. పంటకాలం 165 రోజులు. ఎకరాకు 30 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. ఉల్లి కోడును తట్టుకుని నిలబడుతుంది. సన్న బియ్యం 60 రోజుల వరకు నాటుకోవచ్చు. చేను మీద పడిపోదు.
- సాంబ మసూరి బిపిటి 5204. ఈ విత్తనం 1986లో సాంబమసూరి బిపిటి 5204 విత్తనాన్ని విడుదల చేశారు. ఖరీఫ్, రబీ కాలానికి ఈ విత్తనం అనుకూలం. 145 నుంచి 150 రోజులు పంట కాలం. ఎకరాకు 25 క్వింటాళ్ల ధాన్యం దిగుబడి వస్తుంది. గింజ నిద్రావస్థ నాలుగు వారాలు. సన్న బియ్యం అన్నం మృదువుగా రుచిగా ఉండి మెతుకులు ఒకదానికొకటి అతుక్కోకుండా అన్నం ఎక్కువగా అవుతుంది. గ్లైసీమిక్ ఇండెక్స్ తక్కువగా ఉండడం వల్ల మధుమేహ వ్యాధిగ్రస్తులూ ఈ అన్నాన్ని తినడానికి అనుకూలం.
- పుష్యమి ఎంటియు 1075. ఈ విత్తనం 2008లో విడుదల చేశారు. ఖరీఫ్ సీజన్‌కు ఈ విత్తనం అనుకూలం. 135 రోజులు పంట కాలం. 25 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. అగ్గి తెగుళ్లను, దోమపోటును తట్టుకొని నిలబడుతుంది. సన్న బియ్యం అలాగే చేను పడిపోదు.
- మర ఎంటియు 1064. ఈ విత్తనం 2008లో విడుదలైంది. సార్వా కాలానికి అనుకూలమైన విత్తనం. 150 రోజులు పంట కాలం. ఎకరాకు 25 క్వింటాళ్లు దిగుబడి వస్తుంది. గింజ నిద్రావస్థ మూడు వారాలు. దోమపోటును తట్టుకొని నిలబడుతుంది. బియ్యం సన్నగా ఉండి గింజ రాలేదు. చేను పడిపోదు ముంపును బాగా తట్టుకుని నిలబడుతుంది.
- ధృతి ఎంటియు 1121. ఈ విత్తనం 2015లో విడుదలైంది. రబీ కాలానికి అనుకూలం. దీని పంట కాలం 120 నుంచి 125 రోజులు. ఎకరాకు 24 క్వింటాళ్ల ధాన్యం దిగుబడి వస్తుంది. అగ్గి తెగులు, దోమపోటను తట్టుకొని నిలబడుతుంది. కాండం దృఢంగా ఉండి చేను పడిపోదు. మధ్యస్థ సన్నరకం అన్నానికి బాగుంటుంది. నేరుగా విత్తే విధానంలో సాగుకూ అనుకూలం.
- సుజాత ఎంటియు 1210. 2019లో విడుదలైన ఈ విత్తనం సార్వా, దాళ్వా కాలాల్లో నాటుకోవచ్చు. 125 నుంచి 135 రోజులు పంట కాలం. సార్వాలో 26 నుంచి 28 కింటాళ్ల దిగుబడి దాళ్వాలో 28 నుంచి 30 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. గింజ నిద్రావస్థ రెండు వారాలు. దోమపోటు, అగ్గి తెగుళ్లను తట్టుకుని నిలబడుతుంది. కాండం దృఢంగా ఉంటుంది. చేను పడిపోదు. గింజ రాలడం తక్కువ. నేరుగా విత్తే విధానానికి అనుకూలం.
- మార్టేరు సాంబ ఎంటియు 1224. 2019లో విడుదలైన ఈ విత్తనం సార్వా కాలానికి అనుకూలం. 135 రోజులు పంటకాలం. 26 నుంచి 28 క్వింటాళ్ల వరకు దాన్యం దిగుబడి వస్తుంది. గింజ నిద్రావస్థ రెండు వారాలు. దోమపోటును తట్టుకుని నిలబడుతుంది. పంట చేను పడిపోదు. బియ్యం పారదర్శకంగా ఉండి అన్నానికి అనుకూలంగా ఉంటుంది.

పై రకాల విత్తనాలు పంటకు అనుకూలంగా ఉండి చీడపీడలను ఎదుర్కొని అధిక దిగుబడి వస్తాయని తెలిపారు.

విద్యుత్ భారాలను ప్రతిఘటించాలి


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రసాద్

కొత్తూరు : రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ ఛార్జీలను తక్షణమే తగ్గించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సిర్ల ప్రసాద్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని విద్యుత్ బిల్లులతో జనానికి షాక్ అనే పోస్టర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 30న మండల కేంద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ... ధర్నా నిర్వహిస్తున్నామని, దీనిని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పెంచిన విద్యుత్ ఛార్జీలతో రూ.13 వేల కోట్లు ప్రజలపై భారం పడుతుందన్నారు. ఈయనతో పాటు సిపిఎం నాయకులు నిమ్మక అప్పన్న ఉన్నారు.

వజ్రపుకొత్తూరు : విద్యుత్ వంద యూనిట్ లోపల వాడే పేదలకు ఉచితమని చెప్పిన వైసిపి ప్రభుత్వం... ఉచితం లేదు కదా... అదనపు భారాలు మోపి పేదలు నడ్డి విరుస్తుందని సిపిఎం మండల నాయకులు బి.ఆనందరావు, ఎన్.మోహనరావు అన్నారు. మండలంలోని నగరంపల్లి శివరాంపురంలో విద్యుత్ భారాలు పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ట్రూ అఫ్ ఛార్జీల పేరుతో ప్రతి వినియోగదారుడిపైనా అదనపు భారం మోపుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దీనికి తోడు 2024 భవిషత్ ఏడాది కూడా ఇంధన సర్దుబాటు ఛార్జీల పేరుతో అదనపు ఛార్జీలు ఈ బిల్లుల్లోనే మోపారని అన్నారు. విద్యుత్ ఛార్జీల ధర కంటే అదనపు ఛార్జీల పేరుతో 95 శాతం ప్రజలు వద్ద నుంచి వసూలు చేయడం దారుణమన్నారు. కేంద్ర ప్రభుత్వంతో రాజీపడి కేంద్ర విద్యుత్ సంస్కరణలు అన్నింటినీ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తుందని ఎద్దేవా చేశారు. అత్యంత ఖరీదైన స్మార్ట్ మీటర్లు పెట్టి ఆ ఖరీదును ప్రజల వద్ద నుంచి వసూలు చేసి అదానిని పెంచే ప్రయత్నం ప్రభుత్వాలు చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వీటిని ప్రతిఘటించకపోతే అత్యవసరమైన విద్యుత్ పేదలకు దూరం అవుతుందని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు భానుమతి, రామకృష్ణ, సుగుణవతి, ఎస్.మల్లేసు, ఇప్పిలి బాలకృష్ణ, బి.ధనలక్ష్మి పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు : పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

జెడ్‌పి చైర్‌పర్సన్‌కు అస్వస్థత

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

చికిత్స పొందుతున్న విజయ

జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ ఆదివారం సాయంత్రం అస్వస్థతకు గురయ్యారు. ఉదయం మాజీ బొడ్డేపల్లి రాజగోపాలరావు శతజయంత్యుత్సవాల్లో పాల్గొన్న ఆమెకు మధ్యాహ్నం సమయంలో అధిక రక్తపోటు రావడంతో పాటు, ఎడమ చేతికి తీవ్రమైన నొప్పితో బాధపడ్డారు. పరిస్థితిని గుర్తించి ఆమె కుటుంబ సభ్యులు హుటాహుటిన కిమ్స్‌కు తరలించారు. వైద్య పరీక్షల సమయంలో బిపి 170/100 నమోదు కావడంతో పాటు న్యూరో సమస్యతో ఆమె బాధపడుతున్నట్లు వైద్యులు నిర్ధారించి తగిన చికిత్స అందించారు. సాయంత్రానికి ఆమె కోలుకున్నట్లు వైద్యులు తెలిపారు.

మంటల్లో కాలిపోతున్న పాత ఎంపిడిఒ కార్యాలయం

పాత ఎంపిడిఒ కార్యాలయంలో అగ్ని ప్రమాదం

ప్రజాశక్తి- పొందూరు

మండల కేంద్రంలోని పాత ఎంపిడిఒ కార్యాలయం వెనుక భాగం పూర్తిగా అగ్నికి ఆహుతైంది. ఆదివారం కార్యాలయం వెనుక బాగాన మంటలు చెలరేగడాన్ని స్థానికులు గుర్తించి వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. సకాలంలో అగ్నిమాపక సిబ్బంది చేరుకుని మంటలను పూర్తిగా అదుపు చేశారు. అప్పటికే కార్యాలయం వెనుక భాగాన ఉన్న పాత రికార్డుల రూమ్ దగ్ధమైంది. ఈ అగ్ని ప్రమాదానికి విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా అధికారులు, అగ్నిమాపక సిబ్బంది చెబుతున్నారు. అగ్ని ప్రమాదంపై సమాచారం అందుకున్న ఎంపిడిఒ సీపాన హరిహరరావు అక్కడికి చేరుకుని ప్రమాద ఘటనను పరిశీలించారు. ఇటీవల ప్రారంభించిన నూతన కార్యాలయంలోకి తరలిపోవడంతో రికార్డులనూ అక్కడికే తరలించామని, పాత రికార్డులు ఏమైనా ఉన్నాయేమోనని పరిశీలించాల్సిందని తెలిపారు. పాత కార్యాలయంలోని విద్యుత్ మీటర్ నుంచే వెలుగు, ఎన్ఆర్ఇజిఎస్ కార్యాలయాలకు విద్యుత్ సరఫరా అవుతుందని అన్నారు.

ఆధారాలను సేకరిస్తున్న క్లూస్ టీం

అర్ధరాత్రి దొంగల హల్‌చల్
ఐదు ఆలయాల్లో చోరీ

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

మండలంలోని పురుషోత్తపురంలో శనివారం అర్ధరాత్రి దొంగలు హల్‌చల్ సృష్టించారు. గ్రామంలోని శివాలయం, మండలమ్మతల్లి పేరంటాలు, సంతోషిమాత, కోదండ రామస్వామి, త్రినాథస్వామి ఆలయాల్లో అర్ధరాత్రి దొంగలు చొరబడి బీభత్సం సృష్టించారు. కోదండరామస్వామి ఆలయంలో స్వామి వారి కిరీటాలు, ఆభరణాలు, వెండి వస్తువులు, నగదు ఎత్తుకెళ్లారు. శివాలయంలో పూజల కోసం ఉపయోగించే వెండి వస్తువులను అపహరించారు. త్రినాథస్వామి ఆలయంలో స్వామి వారి బంగారు కళ్లు కిలో వెండి కిరీటాలను దోచుకుపోయినట్లు ఆలయ అర్చకులు తెలియజేశారు. ఐదు ఆలయాల్లో కలిపి మొత్తం తులం బంగారం, రెండు కిలోన్నర వెండి, హుండీల్లోని రూ.పది వేలు నగదు దోచుకుపోయినట్లు అర్చకులు తెలిపారు. శనివారం రాత్రి రోజులానే ఆలయాలకు అర్చకులు తాళాలు వేశారు. ఆదివారం ఉదయం వచ్చి చూసేసరికి ఆలయాల తలుపులు పగగొట్టి ఉండడాన్ని చూసి గ్రామస్తులకు సమాచారం అందజేశారు. వెంటనే పోలీసులు చేరుకుని పరిసరాలను పరిశీలించారు. రాత్రి సమయంలో దొంగలు ఆలయాల్లో చొరబడి విలువైన వస్తువులను దోచుకుపోవడంతో గ్రామస్తులు భయాందోళనలు చెందుతున్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఒకేసారి ఐదు ఆలయాల్లో దొంగలు పడటంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం క్లూస్ టీం సిబ్బంది సంఘటనా స్థలాలను పరిశీలించి వివరాలను సేకరించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుండెపోటుతో 'అరుణోదయ' డైరెక్టర్ మృతి

ప్రజాశక్తి- పోలాకి

శ్రీరాములు (ఫైల్)

మండలంలోని పిన్నింటిపేట అరుణోదయ హైస్కూల్ డైరెక్టర్ హనుమంతు శ్రీరాములు (58) గుండెపోటుతో ఆదివారం మృతి చెందారు. మండలంలోని మగతపాడుకు చెందిన శ్రీరాములు పిన్నింటిపేటలో అరుణోదయ హైస్కూల్ స్థాపించి నడిపిస్తున్నారు. శ్రీరాములు, ప్రగతి స్కూల్ డైరెక్టర్ ఇలపండ గణపతిరావు, విశ్వశాంతి హైస్కూల్ జనార్ధనరావు మాస్టారు కలిసి నరసన్నపేట వెళ్లారు. తిరుగు ప్రయాణంలో జనార్ధనరావు మాస్టారు పోలాకిలో ఉండిపోయారు. శ్రీరాములు గణపతిరావు కలిసి ద్విచక్ర వాహనంపై పిన్నింటిపేట వైపు స్వగ్రామానికి వెళ్తున్నారు. మార్గంమధ్యలో మొగిల్లిపేట వద్ద శ్రీరాములు స్పృహకోల్పోయి వాహనంతో పాడిపోయాడు. వెనుక కూర్చున్న గణపతిరావు గాయపడ్డాడు. వెంటనే వీరిని స్థానికులు పోలాకి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించగా... శ్రీరాములు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతుడికి భార్య రాములమ్మ, కుమారుడు నిరంజన్ ఉన్నారు. కుమారుడు ఇటీవల బెంగుళూరులో ఎంటెక్ కోర్సులో చేరారు. ఈ విషాద సంఘటన జరగటంతో కుటుంబ సభ్యులతో పాటు గ్రామస్తులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. తోటి ఉపాధ్యాయులు, సిబ్బంది, ఇతర పాఠశాల డైరెక్టర్లు, నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

ఎస్‌పిడిని కలిసిన గెస్ట్ ఫ్యాకల్టీలు

ఎస్‌పిడికి సమస్యలను వివరిస్తున్న గెస్ట్ ఫ్యాకల్టీలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

కెజిబివిల్లో పనిచేస్తున్న గెస్టు టీచర్స్‌ను, లెక్చరర్స్‌ను యథావిధిగా కొనసాగించాలని ఎపి సమగ్ర శిక్షా అభియాన్ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సంఘం నాయకులు ఎన్.ధనలక్ష్మి, వి.ఎన్.సునీతలు డిమాండ్ చేశారు. సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు పర్యటన నేపథ్యంలో నగరంలోని సమగ్ర శిక్షా అభియాన్ కార్యాలయం వద్ద ఆదివారం ధర్నా చేపట్టారు. అనంతరం శ్రీనివాసరావును కలిసి విన్నవంచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని 32 కెజిబివిల్లో 150 మంది గెస్టు టీచర్స్, లెక్చరర్స్, సిఆర్‌టి, పిజిటిలుగా 8 ఏళ్లుగా పనిచేస్తున్నామని అన్నారు. డిగ్రీ, బిఇడి, పోస్టు గ్రాడ్యుయేషన్ అర్హత కలిగి ఉన్నారని అన్నారు. ఏటా నోటిఫికేషన్ ఇచ్చి వీరంతా అర్హత కలిగి ఉన్నారన్న కారణంగా కొనసాగించారని అన్నారు. దానికి విరుద్ధంగా ఈ విద్యా సంవత్సరం నోటిఫికేషన్ ఇచ్చి కొత్త వారికి ధ్రువపత్రాలు పరిశీలించడం, కౌన్సెలింగ్ నిర్వహించడం సరికాదన్నారు. సిఆర్‌టిల నియామకం తర్వాత మిగిలిన ఉద్యోగాల్లో అవకాశం ఇస్తామని ఎస్‌పిడి హామీ ఇచ్చారు. అంతకుముందు పిజిటిల నియామకానికి సంబంధించిన ధ్రువపత్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో సమగ్ర శిక్షా ఎపిసి డాక్టర్ రోణంకి జయప్రకాష్, డిఇఒ తిరుమలచైతన్య పాల్గొన్నారు. ఎస్‌పిడిని కలసిన వారిలో గెస్టు ఫ్యాకల్టీలు సావిత్రి, ఎస్.స్నేహలత, డి.కల్పన ఉన్నారు.

ఎలక్ట్రానిక్ మీడియా కార్యవర్గం ఎన్నిక

ఇచ్ఛాపురం : స్థానిక శ్రీస్వేచ్ఛావతి అమ్మవారి ఆలయ ఆవరణలో ఇచ్ఛాపురం ఎలక్ట్రానిక్ మీడియా ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సీనియర్ వీడియో జర్నలిస్టు మురళి పండా అధ్యక్షతన నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. యూనియన్‌ని విజయవంతంగా నడపడానికి సమున్నతమైన సలహాలు ఇచ్చే మురళి పండాని సలహాదారుగా, పొట్నూరు శంకర్ గౌరవ అధ్యక్షునిగా, పల్లంటి చిరంజీవిని అధ్యక్షునిగా, బొండాడ శంకర్‌కుమార్‌ను ఉపాధ్యక్షునిగా, పాలేపు దివాకర్‌ను కార్యదర్శిగా, నందిక నవీన్‌కుమార్‌ను సహాయ కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా పిలక కృష్ణతేజారెడ్డి, పొట్నూరు శ్రీను, మణికుమార్ సాహూ, ఎ.వి.శ్రీను, వి.సంతోష్‌కుమార్, ఎం.శ్యాంకుమార్, మాధవరావు నియమితులయ్యారు.

కుమారునికి తల్లి అప్పగింత

లక్ష్మిని అప్పగిస్తున్న ఢిల్లీరావు

ప్రజాశక్తి- సోంపేట

మానసిక వైకల్యంతో 15 ఏళ్ల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయిన వద్ధురాలికి ఆశ్రయం కల్పించి... ఆమె కుమారుడికి తిరిగి మనోబంధు నిర్వాహకులు ఆదివారం అప్పగించారు. ఈ సందర్భంగా మనోబంధు సంస్థ జిల్లా కన్వీనర్ దీన ఢిల్లీరావు మాట్లాడుతూ పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరుకు చెందిన గండుపల్లి లక్ష్మి మానసిక వైకల్యంతో బాధపడుతూ వీధులు వెంట తిరుగుతుండడాన్ని గమనించిన తమ సంస్థ ఆమెను అక్కున చేరుకుందన్నారు. విశాఖపట్నంలోని మెంటల్ ఆస్పత్రిలో వైద్యం చేయించి ఆమె మామూలు స్థితికి చేరుకున్న తర్వాత సీతయ్య ఫౌండేషన్లో ఆశ్రయం కల్పించామన్నారు. ఇటీవల ఈ సమాచారాన్ని పత్రికల్లో చూసిన లక్ష్మి కుమారుడు కామరాజు తన తల్లిని అప్పగించాలని సంస్థ సభ్యులను ఆశ్రయించాడు. దీంతో మనోబంధు సంస్థ సభ్యుల సమక్షంలో లక్ష్మిని ఆమె కుమారుడికి అప్పగించారు.

తీర ప్రాంతం సందర్శన

ప్రజాశక్తి- కవిటి

తీర ప్రాంతాన్ని పరిశీలిస్తున్న పర్యాటక అధికారులు

మండలంలోని కపాసుకుద్ది తీరప్రాంతాన్ని మత్స్యశాఖ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డాక్టర్ పి.ఆనంద్, జిల్లా పర్యాటకశాఖ అధికారి ఎన్.నారాయణరావు తదితరులు ఆదివారం సందర్శించారు. పర్యాటక, మత్స్యశాఖ కమిషన్ ఆదేశాల మేరకు కవిటి తీరప్రాంతం సందర్శించిన వీరు తీరప్రాంత భౌగోళిక పరిస్థితులు, వసతి సామర్థ్యాలు పరిశీలించారు. వీరితో పాటు మత్స్యశాఖ సహాయ సంచాలకులు టి.సంతోష్‌కుమార్, పిహెచ్‌డి స్కాలర్ శాంతన్న, సర్పంచ్ ప్రతినిధి కాయ భీమసేన్, మాజీ ఉప సర్పంచ్ ఆరింగి వెంకటరావు, మత్స్యశాఖ సిబ్బంది ఉన్నారు.

చివరి మజిలి కష్టాలు

ఇంటి పునాది పైనుంచి మృతదేహాన్ని తీసుకెళ్తున్న గ్రామస్తులు

పలాస : అంతిమయాత్ర నిర్వహించాలన్నా ఆ కాలనీ వాసులు పునాదులు దాటించి అతికష్టంపై రోడ్డు ఎక్కాల్సిన పరిస్థితి ఉంది. ఇదేదో మారుమూల గ్రామంలో ఉన్న ఇబ్బందులు కాదు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి 15. 16 వార్డుల మధ్యలో ఉన్న నెహ్రూనగర్ కాలనీ వాసుల ఇక్కట్లు ఇది. నెహ్రూనగర్ పెద్దవీధికి సమీపంలో పాత సినిమాహాలు వెనుకభాగాన ఈ కాలనీ ఉంది. ప్రస్తుతం 30 వరకూ కుటుంబాలు ఇళ్లు కట్టుకొని నివసిస్తున్నారు. మరో 40 మందికి ఇళ్ల స్థలాలు ఇక్కడ ఉన్నాయి. రహదారి పూర్తిగా లేకపోవడంతో మూడు అడుగుల స్థలం అంటే మురుగు కాలువ గట్టుపై నుంచి రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి ఉంది. వాహనాలు వెళ్లాలంటే నిర్మాణంలో ఉన్న పునాదులు దాటించి కాలనీకి చేరుకోవాల్సిన పరిస్థితి ఉంది. వాస్తవానికి కాలువ గట్టు ఆరు అడుగుల వెడల్పు ఉండేదని అక్కడి - నివాసస్తుల దస్త్రాలు చెబుతున్నాయి. ఆక్రమణల కారణంగా ఆరు అడుగులు కాస్త మూడు అడుగులు మిగిలింది. రహదారి కావాలని స్థానికులు మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు వద్ద మొరపెట్టుకున్నా ఫలితం లేకపోయింది. దాతలు, కాలనీ వాసుల మధ్య చిన్నపాటి పొరపొచ్చాల కారణంగా రహదారికి అడ్డంకి ఏర్పడింది. ప్రస్తుతం కాలనీలో తాజాగా ఆదివారం ఓ యువకుడు మృతి చెందాడు. మృతదేహాన్ని దహన సంస్కాలు నిర్వహించడానికి అష్టకష్టాలు పడాల్సి వచ్చింది. దీనికి తోడు వర్షం కురవడంతో పునాదుల మీదుగా బురదలోనే నడిచి వెళ్లాల్సిన పరిస్థితి. అధికారులు, పాలకులు తక్షణం స్పందించి కాలనీకి రహదారి కల్పించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

ఆట్యాపాట్యా జిల్లా జట్టు ఎంపిక

ఎంపికైన జిల్లా జట్టు

టెక్కలి : ఆట్యాపాట్యా జిల్లా జట్టు ఎంపిక ప్రక్రియ ఆదివారం స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించారు. జిల్లా సమన్వయకర్త బాడాన నారాయణరావు అధ్యక్షతన జట్టులు ఎంపికయ్యారు. అండర్-14 బాలురు, బాలికల జట్లు ఎంపియ్యారు. ఒక్కో జట్టులో 12 మంది క్రీడాకారుల చొప్పున ఎంపిక చేశారు. ఎంపికైన ఈ జట్లు జూలై 1,2 తేదీల్లో తూర్పుగోదావరి జిల్లా తునిలో జరగనున్న అంతర్ జిల్లాల సబ్‌జూనియర్ ఆట్యాపాట్యా ఛాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ జట్లు ఎంపికల్లో వ్యాయామ ఉపాధ్యాయులు కె.కె.రామిరెడ్డి, లక్ష్మణరావు, రాజా, కాపల రఘునాథరావు, ఆలివేణి, జగ్గమ్మ, నీలకంఠేశ్వరరావు, వెంకటేశ్వరరావు, జానకి, శ్యామలరావు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష


సమస్యలు తెలుసుకుంటున్న వెంకటరావు చిట్టి

ప్రజాశక్తి- పలాస

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతిఒక్కరికీ అందిస్తున్నారని, ఇంకా ఎవరికైనా పథకాలు అందకపోయినా, సమస్యలు ఉన్నా జగనన్న సురక్ష పథకం ద్వారా పరిష్కరిస్తామని వైసిపి మండల పార్టీ అధ్యక్షుడు, పిఎసిఎస్ అధ్యక్షులు పైల వెంకటరావు చిట్టి అన్నారు. మండలంలోని బ్రాహ్మణతర్లలో జగనన్న సురక్ష పథకంలో భాగంగా ఆదివారం ఇంటింటికీ వెళ్లి సమస్యలు ఏమైనా ఉన్నాయా? లేవా? అని ప్రజలకు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగనన్న సురక్ష పథకం ద్వారా సమస్యలు ఉంటే అధికారులు నేరుగా సచివాలయానికి వచ్చి అక్కడక్కడే పరిష్కరిస్తామని చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ బాడాన పుష్ప, ఎంపిటిసి తుంగాన రవణమ్మ, ఎంపిటిసి మాజీ సభ్యులు దంతం వైకుంఠరావు, కర్ర గంగాధరరావు, పైల రజిని, సల్ల కామరాజు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి

ప్రజాశక్తి- జలుమూరు

మొక్కలు నాటుతున్న సత్యసాయి యాత్రికులు

పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని సత్యసాయి సేవా సంస్థల అధ్యక్షుడు ఆర్.లక్ష్మణరావు అన్నారు. మండలంలోని లింగాలవలస, చల్లవానిపేట గ్రామ పరిసరాల్లో ప్రేమతరు కార్యక్రమంలో భాగంగా ఆదివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సత్య సాయి శతజయంత్యుత్సవాల్లో భాగంగా కోటి మొక్కలు నాటుతున్నామన్నారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సంస్థ జిల్లా అధ్యక్షుడు వై.లింగరాజు, జిల్లా సేవాదళ్ ఇన్‌ఛార్జిలు ఎస్.రామచంద్రరావు, అమ్మాయమ్మ, ప్రేమతరు ఇన్‌ఛార్జి బి.చంద్రమౌళి, స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌ఛార్జి బి.నరసింహమూర్తి, అనాది గుప్త, జిల్లా యువత ఇన్‌ఛార్జిలు శివకమార్, బి.సాయిరోహిత, నిఖిల్, లింగాలవలస, చలవనిపేట పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు నిధుల మంజూరు

ఇచ్ఛాపురం : మండలంలోని పది గ్రామాల్లో వివిధ అభివృద్ధి పనులు చేపట్టేందుకు జిల్లా పరిషత్ 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.25.50 లక్షలు మంజూరైనట్లు జెడ్‌పిటిసి ఉప్పాడ నారాయణమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని లొద్దపుట్టి, పాయతారి, ముచ్చింద్ర, బలరామపురం, కొత్తశాసనం, కేదారుపురం, డొంకూరు, కీర్తిపురం, మండపల్లి, తహశీల్దార్ కార్యాలయంలో మరుగుదొడ్ల నిర్మాణాలకు జెడ్‌పి సిఇఒ ఆర్.వెంకటరమణ ఉత్తర్వులు జారీ చేశారని అన్నారు. ఈ నిధులు మంజూరుకు కృషి చేసిన జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయకు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యాసామగ్రితో విద్యార్థులు

విద్యా సామగ్రి పంపిణీ

పొందూరు: మండలంలోని కొంచాడలో ఉన్న 'ది కింగ్ జీసస్ పవర్ టెంపుల్‌లో 'ద రైట్ వే ఛారిటబుల్ ట్రస్టు' చైర్మన్ గంట వసంతకుమార్ ఆదివారం విద్యార్థులకు విద్యాసామగ్రిని అందజేశారు. గ్రామంలోని ఎంపియుపి పాఠశాలలో చదువుతున్న 6,7,8 తరగతులకు చెందిన 70 మంది విద్యార్థులకు ప్లాంక్, పెన్, స్కేల్, పెన్సిల్, ఎరేజర్, షార్ప్నర్ వంటి ఆరు రకాల వస్తువులను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పెయ్యిల అనురాధ, ఎంపిటిసి పెయ్యల సరస్వతి, మాజీ సర్పంచ్‌లు పెయ్యల తవిటిరాజు, ముగడ తవిటినాయుడు, స్కూల్ చైర్మన్ సిడగ అసిరినాయుడు, చింతాడ శివకుమార్, కోరాడ వెంకటరావు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం

శ్రీకాకుళం అర్బన్ : అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయానికి నగరంలోని బలగ ప్రాంతానికి చెందిన వాడిగి మురళి, కల్పన దంపతులు రూ.లక్ష విరాళంగా అందజేశారు. ఆదివారం వారు ఆలయాన్ని సందర్శించిన అనంతరం ఇఒ కార్యాలయంలో నిత్యాన్నదాన పథకానికి చెక్కును అందజేశారు. ఆలయ సీనియర్ సహాయకులు కృష్ణమాచార్యులు చెక్కును స్వీకరించారు. ఆషాడ మాసం ఆదివారం కావడంతో యాత్రికులు దర్శించుకున్నారు.

కుల వ్యవస్థ ఉండకూడదు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అంబేద్కర్ ఆశించిన సమాజం రావాలని పద్మశ్రీ అవార్డు గ్రహీత గరికిపాటి నరసింహారావు నగరంలోని సామాజిక సమరసతా వేదిక కార్యదర్శి బార్ల వేణుగోపాలరావు అధ్యక్షతన ఆనందమయి కన్వెన్షన్ హాల్‌లో ఉత్తరాంధ్ర జిల్లాల సమతా సమ్మేళనాన్ని ఆదివారం నిర్వహించారు. స్త్రీలకు సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలన్నారు. సంఘసంస్కర్తగా గురజాడ అప్పారావు, వితంతు వివాహాలను ప్రోత్సహించిన బంకుమల్లి మల్లయ్యశాస్త్రి, తాగునీటిపై అందరికీ సమాన హక్కులు ఉన్నాయని సర్దార్ గౌతు లచ్చన్న, కుల వివక్ష లేని సమాజం కోసం చట్టం తేవాలని తెన్నేటి విశ్వనాథం ఈ ప్రాంతం నుంచే ఉద్యమించారన్నారు. మాజీ మంత్రి గౌతు శ్యామసుందర శివాజీ మాట్లాడుతూ కుల వివక్షకు వ్యతిరేకంగా తన తండ్రి సర్దార్ గౌతు లచ్చన్న ప్రాణాలకు తెగించి కృషి చేశారని చెప్పారు. కార్యక్రమంలో ఆంధ్రా విద్యాలయం మాజీ ఉపకులపతి ఆచార్య జి.నాగేశ్వరావు, ఎచ్చెర్ల డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విశ్వవిద్యాలయం మాజీ ఉప కులపతి లజపతిరాయ్, పాక సుందరిరాణి, దూలం బూసిరాజు, సిరిపురపు కన్నంనాయుడు, రాగాల నరసింహారావు నాయుడు పాల్గొన్నారు.

నగదును అందజేస్తున్న వెంకటరామన్

విద్యకు ప్రోత్సాహం

శ్రీకాకుళం అర్బన్ : విద్యాభివృద్ధికి ప్రోత్సాహకాలు ఎంతో ప్రబావితం చేస్తాయని జెడ్‌పి సిఇఒ ఆర్.వెంకటరామన్ అన్నారు. బెజ్జిపురం యూత్ క్లబ్ కార్యాలయంలో పదో తరగతిలో ప్రతిభ కనబరచిన 14 మంది విద్యార్థిలకు బెంగుళూరుకు చెందిన ఇండియా లిటరసీ ప్రాజెక్టు ఆధ్వర్యాన జిల్లాలో నిర్వహిస్తున్న బాలవికాస్‌లో రూ.10 వేలు వంతున ప్రోత్సాహాలను ఆదివారం అందజేశారు. నగదుతో పాటు మెడల్స్‌ను అందజేశారు. కార్యక్రమంలో డిఇఒ తిరుమల చైతన్య, వృత్తి విద్యాశాకాధికారి ప్రకాశరావు, యూత్‌క్లబ్ డైరెక్టర్ ఎం.ప్రసాదరావు పాల్గొన్నారు.

పార్కులో సందడి చేస్తున్న చిన్నారులు

పార్కులో పర్యాటకుల సందడి

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్క్‌లో పర్యాటకులు సందడి చేశారు. ఆదివారం సెలవు కావడంతో పర్యాటకులు తరలివచ్చారు. పార్కులో ఉన్న అందాలను ఆశ్వాదించారు. హ్యాంగింగ్ బ్రిడ్జిపై నడిచి వెళ్లారు. జలవిహారం వద్ద బోటు షికారు చేశారు. చిన్నారులు మినీ ట్రైన్ ఎక్కి ఆడుకున్నారు. స్కై సైకిల్ ఎక్కి ఆకాశంలో చక్కెర్లు కొట్టారు. జెయింట్ వీల్ ఎక్కి ఉయ్యాల, జంపాల చేశారు. అనంతరం మెట్టుగూడ జలపాతాన్ని సందర్శించారు.

మేనిఫెస్టోపై ప్రచారం

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

మండలంలోని బుదురువాడ పంచాయతీ బిత్తరతోంకి, టేకులోవ, సంఘందొరవలస గిరిజన గ్రామాల్లో ఆదివారం టిడిపి అరకు పార్లమెంటరీ ఉపాధ్యక్షుడు గొట్టాపు వెంకట నాయుడు పర్యటించి ఇటీవల మహానాడులో చంద్రబాబు ప్రకటించిన ప్రీ మేనిఫెస్టోపై గిరిజనులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019లో చంద్రబాబు అధికారంలోకి వస్తే రూ.3000 పింఛను ఇచ్చేవారని జగన్ రెడ్డి పాలనలో నేటికీ రూ.2750 మాత్రమే ఇస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు లెక్చరర్లందరినీ క్రమబద్ధీకరించాలి

వినతిపత్రం అందజేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్లు

ప్రజాశక్తి- పలాస

ప్రభుత్వ కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్లందరినీ క్రమబద్ధీకరిచాలని కాంట్రాక్టు లెక్చరర్ల సంఘం జిల్లా నాయకులు హెచ్.రామ్మోహన్‌దొర డిమాండ్ చేశారు. కాశీబుగ్గ మంత్రి ప్రగతి భవన్‌లో మత్స్య, పశుసంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజును ఆదివారం కలిసి వివిధ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2014 జూన్ 2 నాటికి ఐదేళ్లు నిండాలన్న నిబంధనతో రాష్ట్రంలో 1700 మంది క్రమబద్ధీకరణ పరిధిలోనికి రాకుండా మిగిలిపోతున్నారని అన్నారు. వారినీ పరిగణనలోకి తీసుకొని న్యాయం చేయాలని కోరారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి కాంట్రాక్టు అధ్యాపకుల క్రమబద్ధీకరణకు నిర్ణయం తీసుకోవడంపై ధన్యవాదాలు తెలిపారు. దీనిపై మంత్రి స్పందిస్తూ సమస్యను సిఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీనిచ్చారు. మంత్రిని కలిసిన వారిలో కె.తిరుపతిరావు, కె.విజయ్‌కుమార్, ఎస్.వీరన్నాయుడు, ఎ.శ్రీనివాసరావు, వై.కృష్ణకుమారి, రామరాజు ఉన్నారు.

విత్తనశుద్ధితో విత్తనాలకు రక్షణ

ఆమదాలవలస : విత్తనశుద్ధితోనే విత్తనాలకు రక్షణ అని ప్రకృతి వ్యవసాయ మండల యాంకర్ నక్క చిరంజీవి అన్నారు. మండలంలోని నిమ్మతొర్లాడలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఆధ్వర్యాన 30 మంది రైతులతో కలిసి వరి విత్తనాలను బీజామృతంతో ఆదివారం విత్తనశుద్ధి చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో ముందుగా విత్తనాలను తప్పనిసరిగా బీజామృతంలో విత్తన శుద్ధి చేసుకోవాలన్నారు. ఇలా చేసుకోవడం వల్ల నేలలో నుంచి వచ్చే ఏ విధమైన తెగుళ్ల బారిన పడకుండా విత్తనాలకు రక్షణ ఉంటుందని తెలిపారు. విత్తనాలు ఇతర బ్యాక్టీరియా, సిలింద్రాల నుంచి వ్యాప్తి చెందే తెగుళ్లను తట్టుకుంటాయన్నారు. విత్తనశుద్ధి చేసుకోవడంతో పూర్తిగా మొలక శాతం వస్తుందని తెలిపారు. విత్తనాలను శుద్ధి చేసుకుని పొలంలో వేసుకోవడంతో ఆరోగ్యకరమైన నారు, మంచి ఫలితాలను పొందవచ్చునని అన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తిరుపతిరావు, కృష్ణవేణి, రైతులు పాల్గొన్నారు.

విత్తన శుద్ధి చేస్తున్న రైతులు

కషాయాన్ని తయారు చేస్తున్న రైతులు

కషాయాలు తయారీ

లావేరు: మండలంలోని బుడుమూరులో బండి పద్మజ అనే రైతు రెండు ఎకరాల విస్తరణంలో బెండ, చిక్కుడు, తోటకూర, గోంగూర, టమాట, ఆనప, కాకర వంటి పది రకాల కూరగాయలు పంట వేశారు. అన్ని రకాల పురుగులకు తెగుళ్ల నివారణకు 200 లీటర్ల దశపర్ని కషాయాన్ని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఆదివారం తయారు చేశారు. ఈ కషాయానికి కావాల్సిన పది రకాలు ఆకులు, ఎల్లుల్లి పేస్టు, పచ్చిమిర్చి పేస్టు, అల్లం పేస్టు, ఆవు మూత్రం, దేశి ఆవు పేడ తీసుకుని కషాయాన్ని తయారు చేశారు. అలాగే కొత్తకుంకంలో వరి విత్తనాలను విత్తన బంతులుగా తయారు చేసి పొడి నెలలో నేరుగా మొక్కకి మొక్కకి, వరుసకి వరుసకి 25 సెంటీమీటర్ల దూరంలో గుంతలు తీసి అందులో కొద్దిగా ఘనజీవామృతం చేసి మూడు విత్తన బంతులుగా చేసిన విత్తనాలను నాటారు. కార్యక్రమంలో అప్పారావు, యూనిట్ ఇన్‌ఛార్జి సోమశేఖర్, డిజిటల్ రాంబాబు పాల్గొన్నారు.

వైసిపి పాలనలో ప్రజలకు భరోసా ఏదీ?

సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి సంధ్యారాణి

ప్రజాశక్తి - సాలూరురూరల్

వైసిపి ప్రభుత్వంలో ప్రజల భవిష్యత్‌కు భరోసా ఎక్కడ ఉందని టిడిపి సాలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుమ్మడి సంధ్యారాణి ప్రశ్నించారు. ఆదివారం ఆమె స్వగృహంలో నియోజకవర్గ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడారు. మహానాడులో టిడిపి ప్రవేశపెట్టిన మేనిఫెస్టోను ప్రజలకు వివరించడానికి చేపట్టిన బస్ యాత్ర మొదటి విడత అనకాపల్లి జిల్లా పాయకరావు పేట, నర్సీపట్నం నియోజకవర్గంలో విజయవంతంగా జరిగిందని,ఈ యాత్రకు ప్రజలు బ్రహ్మ రథం పట్టరాని అన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలు, నిరసనలపై వివరించామన్నారు. 98 శాతం హామీలు అమలు చేశామని చెప్పుకుంటున్న ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం ఈ నాలుగేళ్ళ సామాన్యులపై విద్యుత్ ఛార్జీలు 8సార్లు పెంచారని, నిత్యవసరాల ధరలు ఆకాశాన్ని అంటుతున్నా యని అన్నారు. అలాగే అభివృద్ధి చేశానని చెప్పుకుంటున్న సిఎం రాజధాని లేకుండా చేశావని, పోలవరాన్ని ముంచేశావని, విశాఖ రైల్వే జోన్, గిరిజన యూనివర్సిటీ ఎక్కడని ప్రశ్నించారు. సిపిఎస్ రద్దు, జాబ్ క్యాలెండర్ ఏదని ప్రశ్నించారు. సామాన్యులను నిండా ముంచి వారికి భవిష్యత్ లేకుండా రూ.పది లక్షల కోట్లు అప్పులు చేసి మీ జాబ్ నింపు కున్నారే తప్ప పేద ప్రజలకు మీరు చేసిందేమీ లేదని ధ్వజమెత్తారు. ఎప్పుడు ఎన్నికలు వస్తాయానని ప్రజలు మీ ప్రభుత్వాన్ని ఇంటికి పంపడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. సమావేశంలో సాలూరు పట్టణ అధ్యక్షుడు నిమ్మాది చిట్టి, పాచిపెంట మండల అధ్యక్షులు ముఖి సూర్యనారాయణ, నాయకులు కూనిశెట్టి బీమారావు, పప్పల మోహన్, డబ్బి కష్ణ, కన్నబాబు, అప్పారావు, గంగరాజు, బాలాజీ, భాస్కర్, శ్రీను పాల్గొన్నారు.

మెమొంటోను అందజేస్తున్న అశోక్‌గజపతిరాజు

'కలిశెట్టి' యువజన సభ్యుల రక్తదానం

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

కేంద్ర మాజీ మంత్రి, టిడిపి పోలిట్‌బ్యూరో సభ్యులు పూసపాటి అశోక్ గజపతిరాజు జన్మదినం సందర్భంగా అశోక్ బంగ్లాలో ఆదివారం రక్తదానం శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో ఎచ్చెర్ల నియోజకవర్గ టిడిపి నాయకులు, ఉత్తరాంధ్ర శిక్షణ శిబిరం మాజీ డైరెక్టర్ కలిశెట్టి అప్పలనాయుడు, యువసేన సభ్యులు రక్తదానం చేశారు. అనంతరం అశోక్ గజపతిరాజుని మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నెల్లిమర్ల నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి కర్రోతు బంగారురాజు, చీపురుపల్లి నియోజకవర్గ నాయకులు త్రిమూర్తులు రాజు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి శివరామకృష్ణ, పార్లమెంట్ జనరల్ సెక్రటరీ ఐ.వి.పి.రాజు, డెంకడ మాజీ ఎంపిపి చంద్రశేఖర్, కార్యదర్శి రాజేష్, కలిశెట్టి సూర్యనారాయణ పాల్గొన్నారు.

పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

జోలీ వాకర్స్ సభ్యులకు వైద్య పరీక్షలు

పొందూరు: పొందూరు మార్కెట్ కమిటీ కార్యాలయం ఆవరణలో జోలీ వాకర్స్ సభ్యులకు మాజీ జెన్ కో-డైరెక్టర్ బాషా ఆనంద్ మోహన్ అధ్యక్షతన డాక్టర్లు సునీల్‌కుమార్, విజయ్ భాస్కర్ పర్యవేక్షణలో లాబ్ టెక్నిషన్ రమేష్ సహకారంతో ఆదివారం ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ మేరకు 45 మందికి షుగర్, బిపి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఆహారపు అలవాట్లు మార్చుకోవాలని, మాంసాహారం తగ్గించుకోవాలని సూచించారు. ఉప్పు, కారం, తీపి పదార్థాలు వీలైనంత వరకు తగ్గించుకోవాలన్నారు. వాకింగ్, యోగాసనాలు అలవాటు చేసుకోవాలన్నారు. అల్లంశెట్టి కృష్ణారావు, రజని దంపతులు అల్పాహారం అందజేశారు.

బోయ వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చొద్దు

సాలూరురూరల్ : బోయ వాల్మీకిలను ఎస్‌టి జాబితాలో చేర్చొద్దని గిరిజన సంఘం ఆదివారం సారిక పంచాయతీ కొత్తూరులో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం మండల నాయకులు చింత జోగయ్య, గెమ్మెల బోడమ్మ మాట్లాడుతూ బోయ వాల్మీకి, బెంతు ఒరియాలను రాష్ట్ర ప్రభుత్వం గిరిజన జాబితాలో చేర్చేందుకు తీర్మానం చేసిందని, అసలు అన్ని కులాలు కంటే ముందుగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పరంగా ఎంతో అభివృద్ధి చెంది బిసి జాబితాలో వున్న ఈ కులాలను ఇప్పుడు ఎస్‌టి జాబితాలో చేర్చాలనుకోవడం దారుణమన్నారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి ఇప్పటి వరకు ఇంకా వెనుకబడి ఉన్న గిరిజన జాతుల బిడ్డలు ఉద్యోగ, ఉపాధికి ఇంకా మరొక వందేళ్లు వెనక బడిపోతారాని, ఇంకా ప్రభుత్వాలు తమకు రాజ్యాంగం కల్పించిన హక్కులను హరిస్తుంటే గిరిజనులు చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. ఈ విషయమై ఈనెల 28న పార్వతీపురం ఐటిడిఎ వద్ద జరిగే నిరసన, ధర్నా కార్యక్రమంలో కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాకార్యదర్శి మర్రి శ్రీనివాస రావు, మండల కమిటీ సభ్యులు చింత లక్ష్మి, సుకూరు గంగయ్య, మురళి, కన్నయ్య పాల్గొన్నారు.